జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 27-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 407 పేజీలు: 4 వెల : రూ.7



# ఎందుకు రిలీవ్ చేయలేదు?

* ఎస్ఐలు, సీఐలపై ఎస్పీ సీరియస్
* కొందరు జిల్లా పోలీసు అధికారుల ఒత్తిడే కారణమా
* పాస్‌పోర్టు పేరిట పాత స్థానంలోనే విధులపై ఆరా
* కొమ్ముకాస్తున్న అధికారుల వివరాల సేకరణ

**శ్రీకాకుళం క్రైం, జూలై 26 (వార్త):** జిల్లావ్యాప్తంగా పోలీసులకు ఇటీవల బదిలీలు అయ్యాయి. బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే కొందరు పోలీసులు తమకున్న పరపతి, పలుకుబడి ఉపయోగించుకుని ఇంకా ఆయా పోలీస్‌స్టేషన్లలో తిష్ట వేసుకుని కూర్చున్నారు. ఇంకా చాలా మంది బదిలీ అయిన స్టేషన్లకు వెళ్లనేలేదు. నరసన్నపేట పీఎస్‌లో ఒకరు, కంచిలిలో ఒకరు, పాతపట్నంలో ఒకరు, కాశీబుగ్గలో ఇద్దరు, కొత్తూరులో ఒకరు, సారవకోటలో ఒక కానిస్టేబుల్ ఇంకా రిలీవ్ రాలేదు. శనివారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. 'జాతీయవార్త'లో ప్రచురితమైన 'బదిలీ అయి నెలరోజులైనా జాయిన్ కాలేదు' కథనం ఎస్పీ దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన బదిలీ అయిన పోలీసులు ఇంకా ఎంతమంది రిలీవ్ కాలేదు అనే విషయం సమావేశంలో ఎస్ఐలు, సీఐలకు అడిగినట్టు తెలిసింది. ఎందుకు వారిని ఇంకా అంటిపెట్టుకున్నారన్న దానిపై ఎస్ఐలు, సీఐలను ప్రశ్నించినట్టు తెలిసింది. దీనికి ఆయా పోలీస్‌స్టేషన్ల హౌస్ ఆఫీసర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల నుంచి మౌనమే సమాధానం రావడంతో వెంటనే రిలీవ్ చేయాలని ఎస్పీ ఆదేశించినట్లు సమాచారం. కొన్ని స్టేషన్లో సిబ్బంది బదిలీ అయిన స్టేషన్లకు జాయినింగ్ అయినప్పటికీ తిరిగి పాస్‌పోర్టు తీసుకుని పాతస్థానానికి వెళ్లినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరికొందరు జిల్లా పోలీసు అధికారులపై ఒత్తిడి తెస్తూ అదే పోలీస్‌స్టేషన్లలో ఇంకా పనిచేస్తున్నారని తెలిసింది.





* కౌన్సెలింగ్ ద్వారా పోలీసులకు బదిలీ చేసిన ఎస్పీ
* తక్షణం ఆయా పీఎస్‌లలో జాయిన్ కావాలని ఆదేశం
* కొందరు పోలీసులు ఇంకా విధులకు హాజరుకాని వైనం

## బదిలీ అయి నెల రోజులైనా..

* ఎస్పీ ఆదేశాలు బేఖాతర్
* జిల్లా పోలీసు కార్యాలయం చుట్టూ చక్కర్లు
* దొడ్డిదారిన జిల్లా పోలీసు కేంద్రానికి వచ్చేందుకు యత్నాలు

## జాయిన్ కాలేదట!

**శ్రీకాకుళం క్రైం, జూలై 25 (వార్త):** జిల్లా పోలీసులకు గతనెల కౌన్సెలింగ్ విధానం ద్వారా బదిలీలు జరిగాయి. బదిలీ అయిన వారంతా వెంటనే ఆయా పోలీస్‌స్టేషన్లలో 24 గంటల్లో జాయిన్ కావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ బదిలీ అయిన పోలీసులు ఆయా ప్రాంతాల్లో ఇంకా జాయిన్ కాలేదు. ఎలాగైనా శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి, తమ సొంత గ్రామాలకు సమీప పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేసుకునేందుకు తెరవెనుక పావులు కదుపుతున్నారు. కొందరు జిల్లా పోలీసు అధికారులను పట్టుకుని దొడ్డిదారిన తమకు నచ్చిన స్టేషన్‌లో పోస్టింగ్ వేసుకునేందుకు నానాప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎస్పీ కార్యాలయం, సబ్‌డివిజన్ అధికారుల చుట్టూ తిరుగుతూ తమను ఎలాగైనా బదిలీ చేయాలని కోరుతున్నారు. కొద్ది రోజులు ఆగాలని ఎస్పీ కార్యాలయం అధికారులు సైతం వారికి అభయమిచ్చినట్టు తెలిసింది. బదిలీ అయిన స్టేషన్‌లోనే జీతాలు తీసుకుని, జిల్లా పోలీసు కార్యాలయంలో విధులు నిర్వహించేలా తాము చేయగలమని కొందరు అధికారులు వారికి సూచించినట్టు ఆ శాఖలోని కొందరు గుసగుసలాడుకుంటున్నారు. అయితే ఎస్పీ బదిలీ చేసిన తర్వాత కూడా వారిని రిలీవింగ్ చేయకుండా కొందరు అధికారులు తాత్సారం చేయడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయాలు ఏవీ కూడా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లకుండా కార్యాలయంలోని కొందరు అధికారులు మేనేజ్ చేస్తున్నారని తెలిసింది. ఏదేమైనా దీనిపై జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది.



## యువకుడి ఆత్మహత్యాయత్నం

**సరుబుజ్జిలి, జూలై25 (వార్త):** రొట్టవలస గ్రామానికి చెందిన ధనుకోట శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం పురుగుల మందు తాగేశాడు. కుటుంబీకులు అతడిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడు. గతంలో వెటర్నరీ కళాశాలలో అటెండర్‌గా పనిచేసేవాడు. పలు కారణాల వల్ల అతడిని విధుల నుంచి తొలగించారు. ఆ తర్వాత లగేజీ వ్యాన్‌ను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అప్పు తీసుకుని చెల్లించకపోవడంతో అతని వ్యాన్‌ను అప్పు ఇచ్చిన వారు తీసుకున్నట్టు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలిసింది. అయితే కుటుంబీకులు మాత్రం పోలీసుల వేధింపుల వల్లే శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు.

## మిస్సింగ్ కేసులపై దృష్టి సారించండి

* శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసులు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశించారు. శని వారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పెండింగ్లో ఉన్న కేసులు, మిస్సింగ్ కేసులు, ఎన్ఫోర్స్మెంట్ వర్క్స్, విజబుల్ పోలీసింగ్, అవేర్నెస్ ప్రోగ్రామ్స్ జూన్, జూలై నెలలో నమోదు కాబడిన కేసుల దర్యాప్తుపై జిల్లాలో ఉన్న పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్ కేసులలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జ్ షీట్‌లను కోర్టులో దాఖలు చేయాలన్నారు. అపరిష్కృతం కాని మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాన్నారు. గంజాయి, మద్యం, నాటు సారా, పశువులు అక్రమ రవాణాపై నిఘా పెట్టి వాటి రవాణాని అరికట్టాలన్నారు. పేకాట స్థావరాలు, శిబిరాలపై దాడులు చేసి పేకాట నిర్వ హణను అరికట్టాలని పేర్కొన్నారు. పోలీసు అధికారులు ప్రతీ రోజు గ్రామాలు, పాఠశాల, కళాశాలలో సందర్శించి నారీశక్తీ సంకల్పం పేరిట మహిళా భద్రత అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా, మాదక ద్రవ్యాలు వలన కలిగే అనర్థాలు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కలిపించాలని తెలిపారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థుల జీవన విధానాన్ని ఆరా తీసి శాంతి భద్రతలకు భంగం కలిగించే వారపై చట్ట ప్రకారం చర్యలకు ఆదేశించారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్స్ కేసులలో 60 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి చార్జ్ షిట్స్ కోర్టులో దాఖలు చేయాలన్నారు. నాన్ బెయిల్ వారెంట్స్ వీలైనంత మేరకు అమలు పరిచి సదరు వ్యక్తులను న్యాయస్థానంలో హాజరు పరచాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఏఎస్పీ కెవి రమణ, డీఎస్పీలు సి.హెచ్.వివేకానంద్, ఎం.వి అప్పారావు, డి.లక్ష్మణరావు, ప్రసాద్ రావు, ఏ.ఓ సి.హెచ్.గోపీ నాథ్ ఎస్బి సీఐ ఇమ్మన్యాల్ రాజు, డిసిర్బీ సీఐ శ్రీనివాస్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ప్రతిభను ప్రదర్శించిన పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలను ఎస్పీ అందజేసి అభినందించారు.

# భూ ఆక్రమణదారుడి.. బరితెగింపు!

* కోర్టు ఉత్తర్వులు సైతం ఉల్లంఘన
* ప్రశ్నించే వారిపై దౌర్జన్యం
* రెవెన్యూ హెచ్చరిక బోర్డులను సైతం తొలగింపు
* అతడిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా
* బైండోవర్ ఉన్నా డోంట్‌కేర్ అంటున్నాడు
* చర్యలకు వెనుకాడుతున్న అధికారులు
* తన వెనుక పెద్దలు ఉన్నారంటున్న కబ్జాకోరు



**ఆమదాలవలస, జూలై 26 (వార్త):** జొన్నవలస గ్రామానికి చెందిన ఓ భూ ఆక్రమణదారుడు బరితెగించేశాడు. ఏకంగా నిర్వాసితుల భూమిని ఆక్రమించేశాడు. రెవెన్యూ అధికారులు ఆ భూమి ప్రభుత్వానిది అంటూ కోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను సైతం తొలగించేస్తున్నాడు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడుతున్నాడు. రెవెన్యూ అధికారులను సైతం హడలెత్తిస్తున్నాడు. వివరాల్లోకి వెళితే.. ఆమదాలవలస మండలం చిన్న జొన్నవలస గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ నిర్వా సితుల కోసం రైతుల నుండి భూములు సేకరించి కొనుగోలు చేసింది. నిర్వాసితులకు కేటాయించిన స్థలము సర్వేనెంబర్ 121-20 భూమిని చిన్న జొన్నవలస గ్రామానికి చెందిన రెడ్డి రాజులు వారి కుమారులు నర్సింగరావు రెడ్డి, అప్పారావు అనే వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని వరి పంట వేశారు. ఈ స్థలము విలువ 50 లక్షలకుపై ఉంటుందని



స్థానికులు చెబుతున్నారు. నిర్వాసితుల కోసం భూమిని ఎక్వైర్ చేసిన రైతు జిల్లా ఉన్నతాధికారులకు ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. ఆ స్థలంపై ఉన్న ఆక్రమణలు తక్షణం తొలగించాలని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఆ స్థలంలో ఏర్పాటు చేశారు. ఆక్రమణదారుడు వెను వెంటనే ఆ బోర్డును తొలగించి తిరిగి ఆ స్థలాన్ని తన అధీనంలోకి తీసుకున్నాడు. ఈ స్థల వివాదంపై పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదైవుంది. ఆక్రమణదారుడిపై బైండోవర్ కూడా ఉంది. రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో రెండు సార్లు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగా, రెండు సార్లు కూడా దీన్ని పీకేశాడు. అయితే కొందరు అధికారుల అండదండలతోనే భూఆక్రమణదారుడు పేట్రేగిపోతున్నాడన్న విమర్శలు ఉన్నాయి. ఆక్రమణదారుడిపై రెవెన్యూ, పోలీసు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదోనని కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీనిపై గ్రామస్థులు కొందరు ఏకంగా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధం అవుతున్నట్టు తెలిసింది.











# ఎంజీఆర్.. తొలి అడుగు సక్సెస్

- ✳ మామిడి గోవిందరావు సారధ్యంలో అభివృద్ధి పథంలో పాతపట్నం నియోజకవర్గం
- ✳ఏడాదిలోనే 650 కోట్ల రూపాయలతో నియోజకవర్గం సమగ్రాభివృద్ధి
- ✳ నిరుద్యోగ యువతకు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు సన్నాహాలు
- ✳ 265 కోట్లతో అతి త్వరలో ఉద్దానం ఫేస్ టు ఇంటింటికీ మంచినీటి కొళాయిలు
- ✳ ఏడాది "సుపరి పాలనలో తొలి అడుగు'కు గ్రామ గ్రామాల్లో బ్రహ్మరథం
- ✳ ఎమ్మెల్యే అయినప్పటికీ నేటికీ సొంత నిధులతోనే సేవా కార్యక్రమాలు
- ✳ ఏడాదిలోనే పాతపట్నంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిన ఎంజీఆర్ ప్రస్థానం

**పాతపట్నం, జూలై 26(వార్త):** పాతపట్నం నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని భారీ మెజార్టీతో గెలుపొందిన మామిడి గోవిందరావు ఏడాది ప్రస్థానం విజయపథాన ముందుకుసాగింది. నియోజకవర్గ చరిత్రలో కనివిని ఎరుగనిరీతిలో సుమారు 650 కోట్ల రూపాయలతో ఐదు మండలాలలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. దశాబ్దాల కాలంగా





రహదారులకు నోచుకోని గ్రామాలు కూడా నేడు రహదారుల నిర్మాణానికి అంకురార్పణ జరిగిందంటే.. అందుకు ఎమ్మెల్యే ఎంజీఆర్ పరిపాలన దక్షతేనని చెప్పక తప్పదు. అలాగే ఎన్నో ఏళ్ల నుండి గ్రామాల్లో సిసి రహదారులు లేక నేటికీ ఇబ్బంది పడుతున్న గ్రామాలలో ఉపాధి హామీ పథకం నిధులతో పెద్దఎత్తున రహదారులను నిర్మించుకోవడం జరిగింది.

వెనుకబడిన నియోజకవర్గం కావడంతో యువత ఉద్యోగాలు లేక వలస బాట పట్టడంతో కలత చెందిన ఎంజీఆర్ మెళియాపుట్టి మండల కేంద్రంగా ఏపీఐఐసీ ద్వారా ఇండస్ట్రియల్ క్యారిడార్ ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడితో కలిసి శంకుస్థాపన పనులు ప్రారంభించడం జరిగింది. వంశధార, మహేంద్ర తనయ లాంటి నదులు ఉన్నప్పటికీ ప్రక్కన ఉన్న నియోజకవర్గాలకు గత పాలకుల నిర్లక్ష్య వైఖరితో తాగునీరు, సాగునీరు తరలి వెళుతుందనే ఆవేదనతో ఉద్దానం ఫేస్ టు పథకంలో భాగంగా జలజీవన్ మిషన్ ద్వారా 265 కోట్ల రూపాయలతో నియోజకవర్గంలోని ఐదు మండలాలలోని ప్రతి ఇంటికి మంచినీటి కొళాయిలను మరికొద్ది నెలలో అందించుటకు అంకురార్పణ చేయడం జరిగింది.

సరైన విద్యను అందించాలని ఉద్దేశంతో పీఎం జన్మన్ వాస్తు గృహాలను, పాఠశాలలకు ప్రహరీ గోడలను, వసతి గృహాల మరమ్మతుల కోసం అధిక నిధులను తీసుకువచ్చి అభివృద్ధి



చేస్తున్నారు. సాంకేతిక విద్య అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదివించుకునే స్తోమత లేక అర్ధాంతరంగా చదువు నిలిచిపోతుందనే ఉద్దేశంతో ప్రభుత్వ పాలిటెక్నికల్, ఐటిఐ కళాశాల ఏర్పాటుకు తీవ్రంగా కృషి చేశారు.

రైతులు వర్షాధారంపై ఆధారపడి నేటికీ వ్యవసాయం చేస్తుండడంతో కలత చెంది అవసరమైన చోట ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా వంశధార గొట్టా బ్యారేజ్ లెఫ్ట్, రైట్ మెయిన్ కెనాల్ లకు మరమ్మతులు కోసం నిధులను వెచ్చించడం జరిగింది.

వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి వ్యయ ప్రయాసలకు నోచుకోవడం గమనించి పాతపట్నం, కొత్తూరు ఆసుపత్రులు 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయాలని, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంజూరు చేయాలని, వైద్యులు మందులు వైద్య పరికరాలు కొరత లేకుండా ఉండాలని సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించించడం జరిగినది. ఎమ్మెల్యేగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నప్పటికీ గత 15 సంవత్సరాల నుంచి నేటికీ తన తండ్రి గారైన కీర్తిశేషులు మామిడి అప్పారావు చారిటబుల్ ట్రస్ట్ తరఫున తన సొంత నిధులతో దేవాలయాల నిర్మాణాలు, పునర్నిర్మానాలు, పేద, అనాధ విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సహాయం, నిరుపేదలకు వైద్యం ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండడం అభినందనీయం.

అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న తరుణంలో పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు చేపడుతున్న "సుపరిపాలనలో తొలిఅడుగు" లో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి ఏ గ్రామం వెళ్లిన ప్రజలు స్వచ్ఛందంగా బ్రహ్మరథం పట్టడం ఆయన పనితీరుకు నిదర్శనం. సామాన్యుడిగా, సేవా తత్పరుడుగా, స్థానికుడిగా ప్రజల అభిమానం చోరగున్న ఎంజీఆర్ అనంతకాలంలోనే పాతపట్నం నియోజకవర్గం చరిత్రలో ఒక బలమైన రాజకీయ శక్తిగా ఎదగడం విశేషం.





## బీజేపీ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

**ఇచ్ఛాపురం, జులై 26(వార్త):** బీజేపీ నూతన పధికారుల సమావేశం శ్రీకాకుళంలో జరిగింది. జిల్లా కోశాధికారిగా వల్లంపాటి కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులుగా మంగి లక్ష్మి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నీలవేణి బాధ్యతలు స్వీకరించారు. వీరికి నియామక పత్రాలు జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అందజేశారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి చెందిన కిరణ్‌దాస్, కాళ్ల శ్రీనివాస్‌కు కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎరువులొచ్చేశాయ్..!

**సరుబుజ్జిలి, జులై 26(వార్త):** సరుబుజ్జిలి పీఏసీఎస్, డీసీఎంఎస్‌కు 20 ఎంటీఎస్ చొప్పున యూరియా వచ్చిందని మండల వ్యవసాయ అధికారి మన్మధరావు తెలి పారు. మండల రైతులు యూరియా గురించి అధైర్యపడవద్దన్నారు. యూరియాని ఆయన ఆధ్వర్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.



# గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు



**-టంకాల దుగ్గివలసలో రిమ్స్ వైద్య బృందం పర్యటన**
**-జ్వరాలతో బాధపడుతున్న రోగులకు రక్త నమూనా పరీక్షలు**

**జి.సిగడాం, జులై 26(వార్త):** టంకాల దిగ్గువలసలో జ్వరాలు తగ్గేంతవరకు వైద్య శిబిరాలు, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని మండల వైద్యాధికారులు యశ్వంత్, సుమబిందు తెలిపారు. జ్వరాలు తగ్గుముఖం పట్టినప్పటికీ కీళ్లు నొప్పులు, కాలు పొంగులు ఉండడం, నెలరోజులుగా అక్కడక్కడ జ్వరాలు విజృంభించడంతో శనివారం జిల్లా కేంద్రాసుపత్రి నుంచి రాపిడ్ ప్రత్యేక వైద్య బృందం ఆ గ్రామాన్ని సందర్శించారు. జ్వరాలు ఉన్న ఇంటింటికి వెళ్లి రోగుల రక్త నమూనాలు సేకరించారు. ఈ రక్త నమూనాలను జిల్లా కేంద్ర ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం తరలించారు. పారిశుధ్య లోపం, దోమలు, ఈగలు బెడదతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, అంటు వ్యాధులు, జ్వరాలు విజృంభిస్తాయన్నారు. ఈ బృందంలో కమ్యూనిటీ మెడిసన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.మనోజ్, మైక్రో బయాలజీ బి.రాధిక, జనరల్ ఫిజీషియన్ పనిత్ రాహుల్, మెడిసిన్ డిపార్ట్మెంట్ రణధీర్ రెడ్డి ఉన్నారు.

**ముమ్మరంగా పారిశుధ్య పనులు**

టీడీ వలసలో సీజన్ జ్వరాలు పెరగడంతో ఇప్పటికే తాగునీటి బోర్లు, బావుల్లో నీటిని పరీక్ష చేయించామని ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు తెలిపారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నారు. మరోవైపు దోమల నివారణ మందును ఫాగింగ్ చేయిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సత్య నారాయణ, మండల వైద్య సూపర్‌వైజర్ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి అసిరయ్య పాల్గొన్నారు.

# మహిళా గ్రామ సంఘాలకు వీపీఆర్పీ శిక్షణ

**మందస, జులై 26(వార్త):** కేంద్ర మంత్రిత్వశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ సూచనలను అనుసరించి అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలకు వీపీఆర్పీ గ్రామ సమృద్ధి స్థాపక ప్రణాళికపై శిక్షణ ఇస్తున్నట్లు ఐటీడీఏ అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సన్యాసిరావు తెలిపారు. మందసలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రణాళికను మహిళా సంఘాలు, సమాఖ్యలతో తయారు చేసుకొని జి.పి.డి.పి. గ్రామ సభలలో సమీకృతం చేసి ఆమోదం పొందాలన్నారు. మహిళలు, మానవ అభివృద్ధి, సాంఘిక అంశాలపై సమగ్ర ప్రణాళిక తయారు చేసుకోవాలని ఐ.బి. డి.పి.ఎం. మోహనరావు తెలిపారు. అన్ని గ్రామ సంఘాల కూడా వ్యక్తిగత, సామాజిక ప్రణాళికలతో పాటు లైవ్లీ హుడ్ ప్రణాళికను సిద్ధం చేసుకుని అమలు పరచాలని మండల స్థాయి సిబ్బందికి మందస వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు సూచించారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారకమోహన్, అకౌంటెంట్లు కళ్యాణి, కృష్ణకుమారి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు గ్రామ సంఘం అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.






## దళిత కాలనీలో డ్రైనేజీ, రోడ్డు నిర్మించాలి

**సరుబుజ్జిలి, జులై 26(వార్త):** సరుబుజ్జిలి దళిత కాలనీలో డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయని, చిన్న వర్షానికి రోడ్డుపై బురద నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోయారు. మూడు రోజుల నుండి కురిసిన వర్షానికి కాలనీలో రోడ్డు ఇండ్ల ముందు బురదమయమై దుర్వాసన వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ప్రతినిధి ప్రకాష్ మాట్లాడుతూ దళిత, గిరిజన కాలనీలపై వివక్ష చూపడం దారుణం అన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే డ్రైనేజీ, రోడ్డు నిర్మించి దళిత కాలనీలో ఉన్న పేదలు వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని కోరారు. డ్రైనేజీ ఉన్న ప్రాంతాలలో పూడికతీత తీయించి బ్లీచింగ్ పిచికారీ చేయించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఏఎంసీ డైరెక్టర్‌గా యండ జయమ్మ



**సరుబుజ్జిలి, జులై 26(వార్త):** ఆమదాలవలస ఏఎంసీ డైరెక్టర్‌గా యండ జయమ్మను ఎంపిక చేయడంపై సరుబుజ్జిలి గ్రామ, మండల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణతో పనిచేసే కార్యకర్తలకు పార్టీ గౌరవిస్తుందన్నారు. యండ రామారావు మాట్లాడుతూ పదవుల కోసం ఏ రోజు ఆశించలేదని, తన తల్లికి డైరెక్టర్ ఇవ్వటం చాలా ఆనందంగా ఉందని, పదవి మరింత బాధ్యతను గుర్తు చేస్తుందన్నారు. మమ్మల్ని గుర్తించి ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కూన రవికుమార్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణకి ధన్యావాదాలు తెలిపారు.

## ఉత్తరాంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



**ఇచ్ఛాపురం, జులై 26(వార్త):** ఉత్తరాంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి సాలిన ఢిల్లీయాదవ్ అన్నారు. ఉత్తరాంధ్రకి చెందిన అశోక్‌గజపతిరాజును గవర్నర్ చేశారని, కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర మంత్రి చేశారని, సామాన్య కుటుంబం నుంచి వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడును ఎంపీగా చేశారన్నారు. వైస్సార్సీపీ ప్రభుత్వం ఉత్తరాంధ్రను నాశనం చేసిందని, కూటమి ప్రభుత్వం హయాంలో విశాఖకు ఐటీ కంపెనీలు వస్తున్నా యన్నారు.

## కారుతో సహా 365లీటర్ల సారా పట్టివేత

**-నలుగురు వ్యక్తులు అరెస్టు**

**మందస, జులై 26(వార్త):** కారులో 365లీటర్ల సారా రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సోంపేట సీఐ జీవీ రమణ తెలిపాచనెరు. ఓ కారులో సారా రవాణా జరుగుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో బయలుదేరి కంచిలి మండలంలోని జక్కర రైల్వే గేటు దగ్గరో ఇండికా కారును పట్టుకున్నారు. అందులో 12పాలిథిన్ సంచులలో ఉంచిన 240 లీటర్ల సారా, 5గోనె సంచులలో ఉన్న 1250 సారా ప్యాకెట్లు కలిపి 365 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కంచిలి మండలంలోని సాలీన పుట్టుగకు చెందిన సాలీన సూర్యనారాయణ, కత్తివరంనకు చెందిన మద్దిల ప్రసాద్, పులకపుట్టుగకి చెందిన పులక కుర్మారావు, ఒడిషాకి చెందిన లోకనాథంను అరెస్టు చేసి, కారుని సీజ్ చేశామని చెప్పారు. వీరికి సారా సరఫరా చేసిన ఒడిశాలోని జగన్నాదపురంనకు చెందిన కొరికాన ప్రకాష్ మీద కూడా కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బంది మార్కారావు, భాను, అరుణ్, ఉమాపతి, గుణాకర్‌ను ఆయన అభినందించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఘనసర సమీపంలో రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి

**-పాలకొండ మండలం అన్నవరం గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు**



**భామిని, జులై 26 (వార్త):** గుణుపూర్‌లో జరగనున్న తల్లి సంవత్సరీకానికి వెళ్తుండగా, రోడ్డు ప్రమాదానికి గురై కుమార్తె మృతి చెందిన ఘటన భామిని మండలం ఘనసర వద్ద శనివారం చోటు చేసుకుంది. పాలకొండ మండలం అన్నవరం గ్రామానికి చెందిన కొండేటి తవిటమ్మ (45) తన భర్తతో కలిసి తల్లి సంవత్సరీకానికి హాజరయ్యేందుకు, ద్విచక్ర వాహనంపై గుణపూర్ వెళ్తుండగా, వెనుకన కూర్చున్న ఆమె చీర కొంగు (పైట) వీల్‌లో దూరిపోయి కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి బత్తిలి పోలీసులు తరలించారు.



## రైతులకు ఎరువుల పంపిణీ

**ఇచ్ఛాపురం, జులై 26(వార్త):** ఇచ్ఛాపురం పీఏసీఎస్ వద్ద శనివారం ఎరువుల పంపిణీ చేపట్టారు. బెల్లుపడ రత్తకన్న రైతులకు యూరియా, డీఏపీ సరఫరా చేశారు. ప్రతి ఎకరానికి యూరియా 25 కేజీలు, డీఏపీ 40 కేజీలు మోతాదు వేయాలని, భూమి ఆధారంగా ఒక్కో ఎకరాకు తగినంత బస్తాలు ఇస్తామని వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ చెప్పారు. నానో యూరియా 500 ఎంఎల్, డీఏపీ (500మి.లీ)ను కూడా రైతులు ఉపయోగించవచ్చన్నారు. నానో ఎరువులు ఖర్చు తగ్గించి, నేల ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు. రైతులు వారం ముందు రైతు సేవా కేంద్రం ద్వారా కూపన్లు పొందాలని, కూపన్ తీసుకొచ్చేటప్పుడు 1బీ, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పెదిని బాబ్జి, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ దాసరి రాజు, తహసీల్దార్ వెంకటరమణ, రైతులు కాళ్ల గోపి, బోరుభద్ర లోహిదాస్, ధూపాన సూర్యనారాయణ, పెదిని దుర్యోధన, రంగాల ధర్మ, కొండ శంకర్, బదకల గణపతి, సంఘ సీఈవో బి.భుజంగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### జీవీఎంసీలో థర్డ్‌పార్టీ ఎంక్వయిరీ చేపట్టిన..
## పలాస మున్సిపల్ కమిషనర్



**పలాస, జులై 26 (వార్త):** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) జోన్-5, ఎడిషన్ అల్ట్రేషన్లో తగ్గిన డిమాండ్ విషయమై, ప్రభుత్వ ఆదేశాల మేరకు పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తన సిబ్బందితో శనివారం నిర్దేశిత 166 ఆస్తులను థర్డ్ పార్టీ ఎంక్వయిరీ చేసి, వాస్తవ నివేదికలను ప్రభుత్వానికి సమర్పించటానికి సిద్ధం చేసే ప్రక్రియను చేపట్టారు. గ్రేటర్ విశాఖపట్నంలోని కంచరపాలెం డి-మార్ట్, కన్వెన్షన్స్ మొదలగు వ్యాపార సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు

## పీ4 విధానం పై అవగాహన



**ఇచ్ఛాపురం, జులై 26(వార్త):** పీ4 విధానంపై 7,8,9,10,14,15 వార్డుల సచివాలయాల పరిధిలో శనివారం సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో నందిగాం కోటేశ్వరరావు, నందికి జానీ, కృష్ణయ్య, రంగాల శ్రీనివాస్ రెడ్డి సచివాలయ స్టాఫ్ హుస్సేన్, జీనత్, మహిళలు పాల్గొన్నారు.

## కిడ్నీవ్యాధిగ్రస్తురాలికి రక్తదానం

**మందస, జులై 26(వార్త):** లోహరిబంద గ్రామానికి చెందిన పందిరి లక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధ పడుతోంది. ఆమెకు బ్లడ్ 6.7 పాయింట్లకు తగ్గడంతో ఏ పాజిటివ్ బ్లడ్ కావాలని సోషల్‌మీడియా వేదికగా ప్రచారం చేయగా, మంచి మనసుతో వజ్రపుకొత్తూరు మండలంలోని పల్లివూరు గ్రామానికి చెందిన ఎస్.చంటి, లోహరిబందకొత్తూరు గ్రామానికి చెందిన అందాల సునీల్ స్పందించి రక్తదానం చేశారు. వీరికి ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# నివగాంలో నిధుల దుర్వినియోగం

**- గ్రామసభలో భగ్గుమన్న ప్రజలు**

**- మౌనం పాటించిన అధికారులు**

**- సమగ్ర విచారణకు డిమాండ్**



**కొత్తూరు, జులై 26(వార్త):** నివగాం పంచాయతీలో పాలనా వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్త స్థితిలోకి జారి పోయిందని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు సైతం కనీస పారదర్శకతను పాటించకుండా, నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో మీసాల వనిత సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అయితే అధికారాలు ఆమె చేతుల్లో ఉండక, మాజీ సర్పంచ్, ప్రస్తుత వార్డు మెంబర్ వీరభద్ర స్వామి గ్రామ పంచాయతీకి సంబంధించిన పనులను స్వయంగా చేపడుతూ, నిర్మాణాలు, బిల్లుల మంజూరు వంటి ముఖ్యమైన నిర్ణయాలను తీసుకుంటున్నారు. నాసిరకం మెటీరియల్‌తో నిర్మాణాలు చేయడం, పనుల బిల్లులను తన ఖాతాలో వేయించుకోవడం వంటి విషయాలు తీవ్ర విమర్శలకు లోనవుతున్నాయి. ఇటీవల కాపు వీధిలో కాలువ పనుల్లో నాసిరకం ఇనుము, సిమెంట్ వాడడంతో, గ్రామ యువత ఆ పనిని అడ్డగించి, ఇంజనీరింగ్ శాఖకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్వయంగా వచ్చి తనిఖీలు చేసి, బిల్లును నిలిపివేశారు. ఇదే తరహాలో గ్రామంలో మరిన్ని పనులు నిబంధనలకతీతంగా, నాణ్యతలేమితో జరగడం తెలుసుకున్న యువత, ఆర్టీఐ ద్వారా ఎంపీడీవో కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన గ్రామసభలో ఎంపీడీవో కార్యాలయం నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా గ్రామ యువత, వార్డు మెంబర్లు కలిసి సర్పంచ్, ప్రతినిధి, కాంట్రాక్టర్, సచివా లయ సిబ్బందిని ప్రజల సమక్షంలో నిలదీశారు. కానీ ఎటువంటి సమాధానం ఇవ్వకుండా, సంబంధిత అధికారులు మౌనం పాటించారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పాలనా పారదర్శకత లేకపోవడం, సర్పంచ్ పాత్ర తక్కువగా ఉండి, నిబంధనల విరుద్ధంగా మరోకరు అధికారాన్ని చలాయించడం, నిధుల దుర్విని యోగం వంటి అంశాలపై గ్రామస్థులు తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామ యువత, ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జిలకు కొనసాగుతున్న శిక్షణ




**కొత్తూరు, జులై 26(వార్త):** కొత్తూరు మండలంలో ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జిలకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమం ఏడీఏ రాజగోపాల్, అడిషనల్ డీపీఎం ధనుంజయరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ శిక్షణలో ఏటీఎం నమూనాపై వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ నమూనా ద్వారా 365 రోజుల పాటు తక్కువ విస్తీర్ణంలో 18 రకాల పంటలు సాగుతో రైతులు నిరంతర ఆదాయం, మంచి ఆరోగ్యాన్ని పొందగలుగుతారన్నారు. పంటల పెరుగుదలకు అవసరమైన క్వాలిటీ ద్రవజీవామృతం తయారీ పద్ధతి, దాని ఉపయోగాలు గురించి ప్రాక్టికల్ డెమోతో వివరించారు. పంటల కాలాన్ని బట్టి పిచికారీ విధానం గురించి సూచనలు ఇచ్చారు. పెద్ద లార్వా పురుగులు, గొంగళి పురుగుల నివారణ కోసం బ్రహ్మాస్త్రం కషాయం తయారీ, దాని ప్రయోజనాలపై డెమో ఇచ్చారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటల సాగు కోసం విత్తన గుళికల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంటీ సూర్యనారాయణ, ఎన్‌ఎఫ్ శ్రావ్య, కొత్తూరు, హిరమండలం మండలాల వీఏఏలు, వీహెచ్‌ఏలు వెంకటేశ్వరరావు, సురేష్, యూనిట్ ఇన్‌చార్జిలు రవి, చిన్నమ్మి, గోవిందరావు, రాములమ్మ, లీడ్ ఫార్మర్లు, ఉత్తమ రైతులు పాల్గొన్నారు.

# పలాస ప్రజానీకానికి నిరంతర విద్యుత్ సరఫరా

**బొడ్డపాడులో నూతన విద్యుత్ స్టేషన్‌ను**

**ప్రారంభించిన ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, జులై 26 (వార్త):** బొడ్డపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్ ద్వారా పలాస రూరల్ ప్రాంతానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయ వచ్చని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు.

శనివారం ఆమె టిడ్కో గృహాల పక్కన ఆ నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఎటువంటి విద్యుత్ సౌక ర్యాలు కల్పించలేదని, ప్రజలు నానా ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం హయాంలో నిరంతరం రూరల్ ప్రాంతాలకు సైతం ఎల్లప్పుడూ విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మల్లా శ్రీనివాసరావు, విఠల్ రావు, బట్ట నాగరాజు, కుత్తం లక్ష్మణ్, కిక్కిర ఢిల్లీ, కంకాల రవిశంకర్ గుప్తా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మూలపేట పోర్టును సందర్శించిన డీజీ

**సంతబొమ్మాళి, జులై 26(వార్త):** మూలపేట పోర్టును రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) మాదిరెడ్డి ప్రతాప్ శనివారం సందర్శించారు. పోర్టు పనులను పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం పోర్టు సిబ్బందితో మాట్లాడారు. ఈయనతో పాటు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మోహన్ రావు, నౌపడ ఎస్సై నారాయణస్వామి, పోర్ట్ జీఎం శంకర్ ఉన్నారు.



## పంచాయతీ/మండల యూనిట్‌గా 'ఉపాధి' కల్పించాలి



**కొత్తూరు, జులై 26(వార్త):** నేరడి పంచాయతీ లో శనివారం జాతీయ ఉపాధి హామీ పథకం సెంట్రల్ టీం కమిటీ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా మండల వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్‌రావు సెంట్రల్ టీంను కలిసి, కీలక సూచనలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రాష్ట్ర స్థాయిలో కాకుండా, ప్రతి పంచాయతీ లేదా మండలాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలని కోరారు. దీంతో గ్రామీణ అభివృద్ధికి ఊపొచ్చి, స్థానిక సంస్థల ప్రాధాన్యం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సూచనలపై సెంట్రల్ టీం కమిటీ సానుకూలంగా స్పందిస్తూ, కేంద్రానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పడాల వెంకటకృష్ణ, బుడ్డ ఆదినారాయణ, భాస్కరరావు, మండల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



**పలాస, జులై 26(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ్ దిన్ శనివారం జరిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్గిల్ యుద్ధ చరిత్రను, భారత సైనికుల త్యాగాలను వివరించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవానుల ధైర్య సాహసాలను స్మరించుకోవాల్సిన ఆవశ్యకతను ఆమె నొక్కి చెప్పారు. విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకుని, దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొవ్వొత్తుల కాంతులతో విద్యార్థులు,అధ్యాపకులు కలిసి వీర జవానులకు ఘనమైన ఘనమైన నివాళులర్పించారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు మాట్లాడుతూ కార్గిల్ విజయ్ దివస్ ప్రాముఖ్యతను, సైనికుల నిస్వార్థ సేవలను ఆయన కొనియాడారు. దేశ సరిహద్దులను కాపాడటంలో సైనికుల పాత్ర ఎంతో కీలకమని, వారి త్యాగా లను మనం ఎప్పటికీ మరువకూడదన్నారు. అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### యుద్ధవీరులకు ఘన నివాళులర్పించిన మాజీ సైనికోద్యోగులు

పలాస-కాశీబుగ్గ మాజీ సైనికుల యూనియన్ కార్యాలయంలో కార్గిల్ విజయదివస్ శనివారం ఘనంగా నిర్వహించారు. అమరులైన సైనికులకు నివాళులర్పిస్తూ, వారి త్యాగాలను కొనియాడారు. వారి ఆత్మకి శాంతి కలగాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ నుంచి శ్రీనివాస లాడ్జి జంక్షన్ వరకు కార్గిల్ యుద్ధ వీర సైనికులారా జోహార్ జోహార్ అంటూ అమర్ జవాన్ అమర్ రహే భారత మాతాకీ జై అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలాస యూనియన్ అధ్యక్షులు ఇళ్ల మన్మథరావు, ఉపాధ్యక్షులు బంగారు బారికి, కార్యదర్శి ఇప్పిలి తాతయ్య, సహాయ కార్యదర్శి బమ్మిడి బాబురావు, కోశాధికారి ఉప్పాడ వెంకట్రావు, కె.నారాయణరావు, టి.గణేష్, పి.కృష్ణారావు, కె.సోమయ్య, అధిక సంఖ్యలో మాజీ సైనికులు పాల్గొన్నారు.



**ఇచ్ఛాపురం, జులై 26(వార్త):** ఇచ్ఛాపురంలోని స్వర్ణభారతి జూనియర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు శనివారం జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ జల్లు జయప్రకాష్ మాజీ సైనికుడు డి.చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి చాట్ల రామురెడ్డి, నెహ్రూ యువ కేంద్ర - మేరా యువ భారత్ వాలంటీర్స్ హంగీర్ బెహరా, పాల్ లివింగ్స్టన్ బెహరా, సోమేశ్ బెహరా, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




## సుడాకు డైలీ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ బాధ్యతలు



**ఇచ్ఛాపురం, జులై 26(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపల్ డైలీ మార్కెట్‌లో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ బాధ్యతలు సుడాకి అప్పగిస్తూ కౌన్సిల్ తీర్మానం చేసింది.

శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. డైలీ మార్కెట్ పడగొట్టి నూతన డిజైన్‌తో నిర్మించేందుకు మున్సిపాలిటీ ఆర్థిక వనరులు చాలనందున షాపులు పడగొట్టి ఖాళీ స్థలంలో నిర్మించడం సుడాకు అప్పగిస్తూ కౌన్సిల్ ఆమోదించింది. బాహుదా వంతెన నుంచి దాసన్నపేట వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కౌన్సిలర్లు ఆశి లీలారాణి, బచ్చు జగన్ కోరారు. కౌన్సిలర్లను సంప్రదించకుండా 16 పనులు రూ.55లక్షలతో కేటాయించడంపై వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీ దివ్య, ఆశి లీలారాణి అభ్యంతరం వ్యక్తం చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డు ఫకీరుపేటలో వీధి లైట్లు వేయాలని వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య కోరారు. రోటరీ క్లబ్ వల్లభరాయగెడ్డ శ్మశానవాటికలో ఏర్పాటు చేస్తున్న గ్యాస్ ఫర్నేష్ యూనిట్ బాహుదా శ్మశానవాటికకు తరలించేందుకు కౌన్సిల్ అంగీకరించింది. అభివృద్ధి పనులు అర్హత ఉన్న కాంట్రాక్టర్లకు అప్పగించాలని కౌన్సిలర్లు కోరారు. బెల్లుపడా హైవే నుంచి వీధి లైట్లు వేయాలని లీలారాణి కోరారు. 8వ వార్డు కౌన్సిలర్ మధుమూర్తి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో కమిషనర్ రమేశ్ పాల్గొన్నారు.



## ఉపాధ్యాయునికి నివాళులు

**పలాస, జులై 26 (వార్త):** బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు జాడు బాబురావు ఇటీవల గుండెపోటుతో అకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పూర్వవిద్యార్థులు ఆయన స్వగ్రామం ఒడిశా రాష్ట్రము గంజాం జిల్లా పత్రపురం తాలూకా సంతోష్‌పూర్‌నకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆ దేవుని ప్రార్థిస్తూ, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో కిక్కర ఢిల్లీరావు, మద్దిల తిరుపతి రావు, బైనపల్లి కేశవరావు, మద్దిల కైలాష్, లక్కోజీ చిరంజీవి, సార సాంబమూర్తి, గేదెల దీపు, గర్తం ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మోసాలు ఎండగడదాం



**పలాస, జులై 26(వార్త):** చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి వెళ్లి వివరించాలని పలాస మున్సిపాలిటీ వైసీపీ నాయకులు అన్నారు. పలాస కాశీబుగ్గ పట్టణ వైస్సార్సీపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం 24, 31వ వార్డుల పరిధిలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ఎన్నికల్లో గెలవడం కోసం ప్రజలకు ఎన్నో సాధ్యం కాని మోసపురితమైన హామీలు ఇచ్చి పదవిలోకి వచ్చారని మండిపడ్డారు. కానీ సీఎం అయిన తరువాత ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలకు ఏవిధంగా వెన్నుపోటు పొడిచాడన్నారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు బడగల బల్లయ్య, 31వ వార్డు కౌన్సిలర్ జోగి.సతీష్, వైస్సార్సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు నర్తు వెంకటరమణ, మునిసిపల్ వైస్ చైర్మన్ బోర బుజ్జి, వైస్సార్సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ గుజ్జ జోగారావు, మునిసిపల్ విప్ శంకర్ పండా, వైస్సార్సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు తూముల శ్రీనివాసరావు, వైస్సార్సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మల్లా సురేష్, 24, 31వ వార్డుల నాయకులు పాల్గొన్నారు.


## విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి

**-స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి**

**-అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి**

**-వామపక్ష నాయకుల డిమాండ్**

**పలాస, జులై 26(వార్త):** కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపిందని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. కాశీబుగ్గలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం వారు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సీపీఎం నాయకులు ఎన్.గణపతి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, రామారావు కుసుమ బాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ పేదలపై విద్యుత్ భారాలను మోపడం సరికాదని అన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేయమని కూటమి నాయకులు చెప్పిన మాటలు ఇప్పుడు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను మోసగించవద్దని కోరారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసి ముఖ్యమంత్రి పారదర్శకత నిరూపించుకోవాలన్నారు. వచ్చేనెల 5న మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి, వీరస్వామి, అప్పన్న, ముకుందరావు, సాయి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



శ్రీకాకుళం

* ఎన్నికలు, పరిపాలన, ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందించుకోవాలి * ట్రాఫిక్ సీఐ నాగరాజు
* విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి
* నారాయణ విద్యాసంస్థల ఆర్ఐ రాంబాబు
* కేబినెట్ ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులతో ప్రమాణ స్వీకారం * ఆకట్టుకున్న విద్యార్థుల మాక్‌డ్రిల్ * అలరించిన నృత్య ప్రదర్శనలు




# విద్యార్థులకు.. నాయకత్వ లక్షణాలు అవసరం











**శ్రీకాకుళం, జూలై 26 (వార్త):** విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని, నేటి బాలురు రేపటి పౌరులని, దేశానికి భవిష్యత్ అని శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని మధురానగర్ కాలనీలో ఉన్న నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు నారాయణ స్కూల్‌లో కేబినెట్ ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ భాస్కరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి సీఐ మాట్లాడారు. చిన్నప్పటి నుంచే ప్రజాస్వామ్యం-విలువలు, సమాజం-విలువలు, ఎన్నికలు, పరిపాలన ఆవశ్యకతపై అవగాహన కలిగివుండాలన్నారు. ఎన్నికల నిర్వహణపై విద్యార్థులు తెలుసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలను నారాయణ విద్యాసంస్థలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యాసంస్థల ఆర్ఐ రాంబాబు మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో లీడర్‌షిప్ లక్షణాలు ఉంటే మున్ముందు మరింతగా ఎదగవచ్చని చెప్పారు. కార్యక్రమానికి ముందు విద్యార్థుల మాక్‌డ్రిల్, నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్లు శ్రీధర్, రమణమ్మ, ప్రమీల రాణి, అకడమిక్ డీన్స్ రమణమూర్తి, పాపారావు, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్ సుష్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.









Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546